క్లుప్తంగా

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు

జూపూడి(ఇబ్రహీంపట్నం):జూపూడి నిమ్రా ఫార్మసీ కళాశాలలో కావాక్వీయస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫార్మసీ విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కావాక్వీయస్ అకాడమీ ప్రతినిధి కరిష్మా రామ్ పిల్లా పాల్గొని విద్యార్థులకు వివిధ పరిశోధన సంస్థల వివరాలు, వివిధ దశల్లో తీసుకోవాల్సిన కీలక నిర్ణయాలపై అవగాహన కల్పించారు. బీ ఫార్మసీ డిగ్రీ తర్వాత ఏవిభాగంలో చేరితే భవిష్యత్తు బాగుంటుందో వివరించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జనార్ధన్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ కృష్ణ, అధ్యాపకులు రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి



మైలవరం: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని తహసీల్దారు అబ్దుల్ దరియా తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన హైస్కూల్‌లో విద్యార్థులు ఒక్కొక్కరికి మూడు జతల ఏకరూప దుస్తులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా నడుపబడుతున్న ఈ పాఠశాల యాజమాన్యం కృషిని ప్రతి విద్యార్థీ అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు. గత 43 సంవత్సరాలుగా గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధిలో చేస్తున్న కృషిని తహశీల్దారు ప్రశంసించారు. ఈ ఏకరూప దుస్తులతో పాటు ప్రతి విద్యార్థికీ టై, బ్యాడ్జ్, బెల్టలను అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దారు బి.మోత్యా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూపూడిని ప్రత్యేక పంచాయతీ చేయాలని వినతి

ఇబ్రహీంపట్నం:జూపూడి గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీగా జూపూడి ఉన్నప్పటికీ పాలన వ్యవహారాలు కిలేశపురం నుంచే జరుగుతుండటం వల్ల అభివృద్ధికి ఆమడ దూరంలో జూపూడి ఉందన్నారు. పంచాయతీ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, డంపింగ్ యార్డులు అన్నీ అక్కడే ఏర్పాటు చేయడం వల్ల జూపూడి ప్రజలు అక్కడకు వెళ్లడం ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు అమ్మాజీ, నీలం జాన్, కన్నా సురేష్, మల్లేశ్వరరావు, సుజనా, రమాదేవి, ప్రమీలతో పాటు మరో 30 మంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ అధికారి రజని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, ఈపాస్, గోడౌన్‌లో స్టాక్ తనిఖీ చేశారు. ప్రతిరోజు కూడా స్టాక్ రిజిస్టర్ నమోదు చేయాలని, ప్రతి బ్యాగు ఈపాస్‌లో ఎంట్రీ చేయాలని, గోడౌన్‌లో స్టాక్‌కి, రిజిస్టర్‌కి వ్యత్యాసం ఉండకూడదని డీలర్లకు సూచించారు. ఎమ్మార్పీకి మాత్రమే ఎరువుల్ని విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వీఆర్వో బసవరావు పాల్గొన్నారు.

విద్యా బోధనపై సమీక్ష



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పారదర్శకమైన బోధన చేయాలని అంగలూరు డైట్ అధ్యాపకులు ఎస్.జోజి తెలిపారు. మండలంలోని చనుబండ జెడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించిన మొదటి క్లస్టర్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా ప్రణాళికా బద్ధంగా బోధించాలని సూచించారు.

ఫ్లోరోసిస్‌పై ఇంటింటా సర్వే



నూజివీడు: మండలంలోని మర్రిబంధంలో ఫ్లోరోసిస్ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఫ్లోరోసిస్ వ్యాధిపై గొల్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా జిల్లా ఫ్లోరోసిస్ నివారణ అధికారి డాక్టర్ బదరీనాథ్ ఫ్లోరోసిస్ వ్యాధి వల్ల కలిగే అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. ఫ్లోరైడ్ అధికంగా ఉన్న నీటిని తాగడం వల్ల ఈ వ్యాధి వస్తుందన్నారు. భూగర్భజలాల్లో ఫ్లోరైడ్ అధికంగా ఉంటుందని, కాబట్టి అందరూ మినరల్ వాటర్‌ను తాగాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి ఫ్లోరైడ్ బాధితులు ఎవరైనా ఉన్నారా అనే దానిపై సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస గౌతమ్, సూపర్‌వైజర్ గూండ్రు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలం



క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విధానం వివరిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్, పార్టీ నాయకులు



పదవులు పొందిన నాయకులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మాజీ మంత్రి జోగి రమేష్

మాజీ మంత్రి జోగి రమేష్

ఇబ్రహీంపట్నం:వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే బలమని మాజీ మంత్రి, నియోజకవర్గం సమన్వయకర్త జోగి రమేష్ తెలిపారు. వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' (రీకాల్ బాబూస్ మేనిఫెస్టో) కార్యక్రమం కొండపల్లి మున్సిపాలిటీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో శనివారం రాత్రి నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రబాబు మేనిఫెస్టో గుర్తుకు తెస్తూ డిజిటల్ స్కీన్‌పై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే విధానం, స్మార్ట్ ఫోన్‌లలో డౌన్ లోడ్ చేసుకునే పద్ధతి గురించి మహిళా అధ్యక్షురాలు ఈశ్వరి వివరించారు. అనంతరం జోగి రమేష్ మాట్లాడుతూ కొండపల్లి మున్సిపాల్టీలో 29 వార్డులకు ప్రత్యేక కార్యకర్తలను నియమించాలన్నారు. వచ్చే సెప్టెంబర్ 2న వైఎస్సార్ వర్ధంతి నాటికి ప్రతి వార్డు నుంచి 50 మంది బలమైన కార్యకర్తలను తయారు చేయాలని సూచించారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని తెలియజేశారు. బడుగు బలహీన వర్గాలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే అండగా ఉన్నారని స్పష్టం చేశారు. పార్టీలు, కులం, మతం చూడకుండా ప్రతి ఇంటికి సంక్షేమం అందించారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటికి మేనిఫెస్టో, ష్యూరిటీ బాండ్లు పంపిణీ చేసి చివరకు ప్రజలను దారుణంగా మోసిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఈసారి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అని ప్రజల్లో, అధికారుల్లో విశ్వాసం పెరిగిందని పేర్కొన్నారు. చంద్రబాబు మేనిఫెస్టో వైఫల్యాలు ఇంటింటికి వివరించాలని కోరారు. మైలవరం నియోజకవర్గం, కొండపల్లి మున్సిపాల్టీకి చెందిన వివిధ పార్టీ కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. నాయకులతో పాటు జోగి రమేష్‌కు సన్మానం చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, జిల్లా ఐటీ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, మాజీ ఎంపీపీ మాధవరావు, జిల్లా కార్యదర్శి శరభయ్య, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, నల్లమోతు దయాకర్, ప్రకాష్, గుంజా శ్రీనివాస్, దయా, జ్యోతిర్మయి, కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, వార్డు కౌన్సిలర్‌లు వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమ్మెకు సీపీఎం మద్దతు



కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకులు



కొండపల్లిలో ఏడో రోజు సమ్మె కొనసాగించిన ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు

తిరువూరు:నగర పంచాయతీ కార్మికుల సమ్మెకు సీపీఎం పట్టణ కమిటీ మద్దతు తెలిపింది. కార్మికుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ విజ్ఞప్తి చేశారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు తమ సంఘీభావం తెలియజేశారు. పార్టీ నాయకులు ఆకుల రవి, మోటూరి చింతయ్య, పంతంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వారం రోజులుగా మున్సిపల్ కార్మికుల సమ్మె

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ కొండపల్లి మున్సిపల్ కార్మికులు శనివారం ఏడోరోజు సమ్మెకు దిగారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పాటు వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీతాలు పెంచలేని పక్షంలో సమ్మె ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కమిషనర్ రమ్యకీర్తన సమ్మె శిబిరం సందర్శించారు. పారిశుద్ధ్య కార్మికులను సమ్మె విరమించాలని కోరారు. ప్రభుత్వం త్వరలో సమస్య పరిష్కరిస్తుందని ఆశాభావం ఆమె వ్యక్తం చేశారు. సీపీఎం టౌన్ కమిటీ సభ్యులు ఎ.విఠల్‌రావు, కొండపల్లి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

ఆగిరిపల్లి: పాఠశాల దశ నుంచే విద్యార్థినులు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శుభ శేఖర్ సూచించారు. శనివారం సాయంత్రం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు పోక్సో చట్టంపై, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు, పాఠశాలలకు రాకపోకలు సాగించేటప్పుడు, ఇతర ప్రాంతాల్లో బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, వేధింపులకు గురి చేసినా అలాంటి వారిపై పోక్సో కేసు నమోదు చేస్తారని శిక్షలు కఠినంగా ఉంటాయని తెలిపారు.

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



నూజివీడులో మాట్లాడుతున్న ఎస్ఈ తోట శ్రీనివాసరావు, పక్కన ఈఈ ఏ సత్యనారాయణ

నూజివీడు: కేంద్ర ప్రభుత్వం రాయితీపై అందజేస్తోన్న సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ సదుపాయాన్ని ఏర్పాటు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ తోట శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడులోని విద్యుత్ శాఖ సిబ్బందికి ఈఈ కార్యాలయంలో సూర్యఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇళ్ల పైకప్పులపై సౌర ఫలకలు ఏర్పాటు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం రాయితీని కల్పించిందన్నారు. దీని ద్వారా నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుందన్నారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, 2 కిలోవాట్‌లకు రూ.60వేలు, మూడు కిలోవాట్ అంతకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన వ్యవస్థకు రూ.78 వేల రాయితీని ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఈ పథకం గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి కనెక్షన్‌లు పెరిగేలా సిబ్బంది పనిచేయాలన్నారు. నూజివీడు ఈఈ ఏ సత్యనారాయణ, ఏడిఈలు ఓలేటి దుర్గారావు, పోతురాజు, రామకృష్ణ, వీరబాబు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

బీమా సదుపాయాలు సద్వినియోగం చేసుకోండి

యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ వెంకట్‌తిలక్



బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న రీజనల్ మేనేజర్ వెంకట్‌తిలక్

ఇబ్రహీంపట్నం:ప్రభుత్వ మద్దతు గల మూడు సామాజిక భద్రతా బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎం.వెంకట్ తిలక్ తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆవరణలో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, పీఎం జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం సురక్ష బీమా యోజన 18–70 ఏళ్ల మధ్య వయస్సు గల బ్యాంకు ఖాతాదారులు రూ.20 వార్షిక ప్రీమియంతో రూ.2 లక్షల ప్రమాద బీమా పొందొచ్చన్నారు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన 18–50 ఏళ్ల వయస్సు కలిగిన వారు ఏడాదికి రూ.436 ప్రీమియంతో రూ.2 లక్షల జీవిత బీమా అందిస్తుందన్నారు. ఇది మరణం, వైకల్యాన్ని కవర్ చేస్తుందని పేర్కొన్నారు. అటల్ పెన్షన్ యోజన వయస్సు, చెల్లింపు వ్యవధి ఆధారంగా నెలకు కనీసం రూ.1000 పెన్షన్‌కు హామీ ఇచ్చే పథకం అన్నారు. పీఎం జన్ ధన్ యోజన కార్డు ద్వారా కూడా రూ.2 లక్షల వరకు పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మేనేజర్ ప్రియాంక, బిపిన్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆందోళనలో ఏఈ కిషోర్ కుటుంబసభ్యులు

తిరువూరు:తనను బదిలీ చేసి నెలరోజులైనా రిలీవ్ చేయకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసిన తిరువూరు మైనర్ ఇరిగేషన్ ఏఈ వి.కిషోర్ ఆచూకీ 48 గంటలైనా లభ్యం కాకపోవడంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సాధారణ బదిలీల్లో తనను తిరువూరు నుంచి గౌరవరానికి బదిలీ చేసిన ఉన్నతాధికారులే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒత్తిడితో రిలీవ్ చేయకుండా ఇబ్బందులు పెట్టడంపై మానసిక వేదనకు గురైన కిషోర్ శుక్రవారం తిరువూరులోని ఇరిగేషన్ కార్యాలయంలోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. కార్యాలయం నుంచి ఒంటరిగా బయటకు వెళ్ళిన ఏఈ కొద్దిసేపటికి ఇరిగేషన్ అధికారుల వాట్సాప్ గ్రూపులో తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ పోస్టు చేశారు. తాను దళితుడనైనందునే తిరువూరు ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రోద్బలంతో విజయవాడ స్పెషల్ డివిజన్ ఈఈ గంగయ్య, కంచికచర్ల స్పెషల్ సబ్ డివిజన్ డీఈ ఉమాశంకర్‌లు రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వలేదని ఆ లేఖలో ఆరోపించారు. గతంలో చేసిన నీరు–చెట్టు పనులకు దొంగబిల్లులు చేయాలని తనను ఒత్తిడి చేస్తూ రిలీవ్ చేయడంలో తీవ్ర జాప్యం చేసిన అధికారులపైన, వారికి సహకరించిన వారిపైన చర్యలు తీసుకోవాలని, కఠినంగా శిక్షించాలని కూడా కిషోర్ తాను రాసిన లేఖలో రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏఈ కిషోర్ బదిలీలో రాజకీయాలా?

ఎమ్మెల్యే వైఖరిని ఖండించిన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి స్వామిదాస్

తిరువూరు:ఉద్యోగుల బదిలీలను రాజకీయ కోణంలో చూడటం తగదని, ఇరిగేషన్ ఏఈ కిషోర్‌ను బదిలీ చేసినా నెలరోజులుగా రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా ఎమ్మెల్యే అధికారులపై ఒత్తిడి చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజులుగా తిరువూరు సెక్షన్ ఇరిగేషన్ ఏఈ కిషోర్ అదృశ్యం కాగా, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖరాసి వెళ్లిపోయాడని చెప్పారు. ఏఈ ఆచూకీ కనుగొనడంలో పోలీసులు విఫలమయ్యారని తెలిపారు. సాధారణ బదిలీల్లో భాగంగా గౌరవరానికి బదిలీ అయిన కిషోర్‌ను రిలీవ్ చేయకుండా ఇరిగేషన్ డీఈ, ఈఈలపై తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఏఈ వ్యవహారం ప్రస్తుత తిరువూరు రాజకీయాలకు అద్దం పడుతుందన్నారు. ఉద్యోగులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న అధికార పార్టీ నాయకులు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. ఏఈ ప్రాణాలకు ఏమైనా హాని జరిగితే ఎమ్మెల్యే బాధ్యత వహించాలని తెలిపారు.

శాకంబరీ నమోస్తుతే



శాకంబరి అలంకరణలో వాసవీ మాత

ఆగిరిపల్లి: శాకంబరి దేవి అలంకరణలో వాసవి మాత దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం ఆర్యవైశ్య మహిళలు, అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు చలవాది వెంకటరత్నం, ఆర్యవైశ్య మహిళా మండల అధ్యక్షురాలు చలువాది శైలజ, మదుపల్లి గోపాలకృష్ణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాల కోసం కృషి



మర్రిబంధంలో కరపత్రాలు అందిస్తున్న సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్



కట్టుబడిపాలెం గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఇంజనీరింగ్ కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తున్న విద్యార్థులు



స్థానికులకు సంచులు అందిస్తున్న ఎక్సైజ్ సీఐ మస్తానయ్య



నూజివీడులోని చిన్నగాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించిన దృశ్యం

నూజివీడు: ప్లాస్టిక్ రహిత గ్రామాల కోసం కృషి చేయాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ తెలిపారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని మర్రిబంధంలో ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీ గ్లాసులు, ప్లాస్టిక్ వాటర్ గ్లాసులు, పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ కవర్లలో వేడి వేడి పదార్థాలు తీసుకెళ్లడం వంటి చర్యలన్నీ మన ఆరోగ్యాన్ని దెబ్బతీసేవేనన్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేడి పదార్థాలను ఉంచి వాటిని తీసుకోవడం వల్ల క్యాన్సర్ కారకాలు మన శరీరంలోకి చేరి క్యాన్సర్ బారిన పడతామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా పక్కన పెట్టేయాలని సూచించారు. అనంతరం గ్రామంలోని పలు దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించొద్దని, క్లాత్ బ్యాగ్‌లను, పేపర్ బ్యాగ్‌లను ఉయోగించాలని అవగాహన కల్పించారు.

ఆగిరిపల్లి: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ బి. భార్గవి తెలిపారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆగిరిపల్లిలో ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ బదులు ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించాలని కోరారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

నూజివీడు: ప్లాస్టిక్ వాడకం అనర్థాలను దృష్టిలో పెట్టుకొని పట్టణంలోని ఎక్సైజ్ సిఐ ఏ మస్తానయ్య శనివారం స్థానికులకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. దాదాపు వంద మందికి సంచులు పంపిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో దుష్ఫలితాలు.....

నూజివీడు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల అనేక దుష్ఫలితాలు సంభవిస్తాయని మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అనే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించారు. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు చిన్నగాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ రహిత సమాజస్థాపన కోసం ప్రతి ఒక్కరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మైలవరం:నిత్య జీవితంలో ప్లాస్టిక్ వినియోగం ఒక భాగమైందని, ప్లాస్టిక్ వినియోగం నిర్మూలించి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్, ప్రకృతి క్లబ్ ఆధ్వర్యంలో ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రజలందరూ జూట్, గుడ్డతో తయారు చేసిన సంచులు వినియోగించాలని సూచించారు. తాగునీటికి రాగి, స్టీల్ బాటిళ్లు వినియోగించినట్లయితే ప్లాస్టిక్కును కొంతమేరకు నివారించేందుకు అవకాశం ఉందన్నారు. సింగిల్ యూజ్, ప్లాస్టిక్ నిషేధం కచ్చితంగా అమలు చేయాలని కోరారు. ప్లాస్టిక్ రహిత జీవన విధానంతో సంపూర్ణమైన ఆరోగ్యం ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి పరిశుభ్రత మూల కారణమని చెప్పారు. ప్లాస్టిక్ రహిత జీవన విధానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి దూరంగా పారబోయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి. శివహరి ప్రసాద్, అసిస్టెంట్ ప్రోగ్రామ్ అధికారి ఉమామహేశ్వర రెడ్డి, ప్రకృతి క్లబ్ కోఆర్డినేటర్స్ డాక్టర్ వి.భాగ్యలక్ష్మి, డాక్టర్ షాహీదా నీలోఫర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

జి.కొండూరు:ప్లాస్టిక్ విరివిగా వాడడం వల్లన పర్యావరణంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని సర్పంచ్ దొంతాల సత్యవతి అన్నారు. స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధి కట్టుబడిపాలెం గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణనాయక్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దొంతాల పూర్ణ, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు



మునునూరులో పారిశుద్ధ్య పనులు, ర్యాలీ చేయిస్తున్న వైద్యాధికారి

ముసునూరు: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ ద్వారా పరిసరాల్లో దోమలు, క్రిమికీటకాల నిర్మూలన చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ సూచించారు. మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను పురస్కరించుకుని గ్రామ సచివాలయాల వద్ద సర్పంచుల అధ్యక్షతన కార్యాలయ పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ముసునూరు పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేయించి, దోమల నివారణ మందులు స్ప్రే చేయించారు. వేల్పుచర్ల సచివాలయం వద్ద జరిగిన సదస్సులో పాల్గొన్న ఎంపీడీఓ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం గ్రామాల్లో చైతన్య సభలు, అవగాహన సదస్సులు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చెప్పారు. గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై దుకాణాల వారికి అవగాహన కల్పించారు. సర్పంచ్ పుట్ల మోహనరావు, నూజివీడు డీఎల్పీఓ సుందరి, తహసీల్దార్ డి.ప్రశాంతి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలవరం అంగన్‌వాడీ కేంద్రంలో నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పి.విజయకుమారి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం

ఆగిరిపల్లి: శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛంద కార్యక్రమం లో భాగంగా స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి ఎస్సై శుభ శేఖర్ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తవేరియా నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన



యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ముసునూరు: ర్యాగింగ్, సోషల్ మీడియా అనర్థాలకు చరమగీతం పాడాలంటే ముందుగా బాలికలు చైతన్యవంతం కావాలని, నూజివీడు గ్రామీణ సీఐ కె.రామకృష్ణ సూచించారు. ముసునూరులోని బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకుమారి అధ్యక్షతన యాంటీ ర్యాగింగ్, సోషల్ మీడియా అనర్థాలపై విద్యార్థినులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చదువుకునే రోజుల్లో సరదాగా ప్రారంభించే ర్యాగింగ్ కాలం పోకడతో అతి పెద్ద సామాజిక రుగ్మతగా తయారైందని చెప్పారు. ర్యాగింగ్ బారిన పడినవారి మనోభావాలు దెబ్బతిని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో పంపుతున్న మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని... వాటి వలలో చిక్కుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.చిరంజీవి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd, మైలవరం బ్రాంచి వారి ... Ack Due ద్వారా ...

రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ

